WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్, రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 350 | సోమవారం 4-5-2026 | పేజీలు : 4 | వెల : 5-00

# కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు




- పటిష్ఠ ఏర్పాట్లు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- బెంగాల్‌లో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- అక్కడ బీజేపీ గెలిస్తే సరికొత్త చరిత్రే
- తమిళనాడులో రిసార్టు రాజకీయాలు మొదలు
- గెలిచే అభ్యర్థులను కాపాడుకొనే పనిలో విజయ్
- మళ్లీ ఎల్డీఎఫ్ గెలిస్తే కేరళలో సరికొత్త రికార్డు
- అస్సాంలో తేలనున్న 722 మంది అభ్యర్థుల భవిత

న్యూఢిల్లీ, **నవతరం**

కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో వెలవడనున్నాయి. అంతకుముందే ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తన పేరు వెనుక సీఎం అనే పదాన్ని తొలగించుకున్నారు.. తమిళనాడులో ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందే రిసార్టు రాజకీయాలు మొదలయ్యాయి. ఈసారి రాష్ట్రంలో హంగ్ వస్తుందని.. తానే కింగ్ మేకర్ అవుతానన్న ధీమాతో ఉన్న టీవీకే అధ్యక్షుడు దళపతి విజయ్, తన ఎమ్మెల్యేలందరిని రిసార్టుకు తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. టీఎంసీ, బీజేపీ మధ్య నువ్వా - నేనా అన్నట్లుగా పోటీ ఉన్న బెంగాల్‌లో ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సీఎం మమతాబెనర్జీ సిద్ధమయ్యారు. ఆదివారమే తన పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు ఆ మేరకు దిశా నిర్దేశం చేశారు. బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీలకు గత నెలలో జరిగిన ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు కోసం కేంద్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బాలెట్లతో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఎగ్జిట్‌పోల్ సర్వేలు భిన్న ఫలితాలను అంచనా వేయటంతో పోటీచేసిన రాజకీయ పార్టీల్లో ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది.

కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈసీ చర్యలు తీసుకుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా అడ్డుకోవడానికి తొలిసారి క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు సర్కార్ కుట్ర



- ఇది 14 లక్షల మంది విద్యార్థులకు వెన్నుపోటు
- కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర విద్యావ్యవస్థ ధ్వంసం
- ప్రశ్నార్థకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ బిడ్డల భవిష్యత్తు
- కేసీఆర్ స్కీమ్‌లే కాదు.. వైఎస్ పథకాలకూ పాతర
- ఫీజు బకాయిలపై విద్యార్థులతో కలిసి పోరాడుతం

హైదరాబాద్‌నవతరం

కాంగ్రెస్ సర్కార్ జీవో 7ను జారీ చేసి 14 లక్షల మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రెండున్నరేండ్ల రేవంత్ అసమర్థ పాలన.. విద్యావ్యవస్థను కుప్పకూల్చడమే గాక, ఇప్పుడు నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే కుటిల యత్నాలకు తెరలేపిందని విరుచుకుపడ్డారు. ఇందులో భాగంగా కొన్నేండ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తున్న ఫీజు

మిగతా 2లో

# అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ రెడీ

- ఐదెకరాల్లో 5 భవనాల నిర్మాణం పూర్తి
- రూ.252 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రాజెక్టు
- 2017లో చంద్రబాబు చేతుల మీదుగా పనులు ప్రారంభం
- అధికారంలోకి రాగానే నిర్మాణం
- ఆపేసిన వైసీపీ ప్రభుత్వం
- 2024లో కూటమి రాకతో పనులు వేగం..
- నిర్మాణాలు పూర్తి త్వరలోనే అత్యాధునిక పరికరాలూ అందుబాటులోకి
- ఈ నెలాఖరులో సీఎం చేతుల మీదుగా ప్రారంభం




# 'ఫ్యూచర్‌సిటీ' అభివృద్ధికి కీలక అడుగు

- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భవనాలకు ప్రారంభోత్సవాలు
- లైఫ్‌సైన్సెస్ కంపెనీల పర్యావరణహిత పరిశోధనా కేంద్రాలు,ప్రధాన రోడ్లకు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనం ప్రారంభం
- సింగరేణి ప్రధాన కార్యాలయ భవనానికి శంకుస్థాపన

మిగతా 2లో



హైదరాబాద్,**నవతరం**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'ఫ్యూచర్‌సిటీ' అభివృద్ధికి సంబంధించి కీలక అడుగు పడింది. త్వరలో అక్కడ పలు ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు కంపెనీల భవనాలకు శంకుస్థాపనలు జరగనున్నాయి. కొన్ని భవనాల ప్రారంభోత్సవం కూడా జరగనుంది. ఈ నెల మూడోవారంలో సీఎం రేవంత్‌రెడ్డి పలు భవనాలకు భూమిపూజ, శంకుస్థాపన చేయడంతోపాటు కొన్ని భవనాలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2న కొన్ని భవనాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాలని నిర్ణయించారు. అయితే ఆ షెడ్యూల్‌లో మార్పులు జరగడంతో ఈ నెల మూడోవారం, నాలుగో వారంలోనే ఆ కార్యక్రమాలను పూర్తిచేయాలని తాజాగా నిర్ణయించినట్టు తెలిసింది. ముందుగా ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవనాన్ని ప్రారంభించేందుకు

# కల్తీ నెయ్యితో ప్రసాదం మహాపాపం

సింఘాల్, వైవీ, ధర్మారెడ్డి, భూమనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి: భానుప్రకాశ్‌రెడ్డి



తిరుపతి **నవతరం**


కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరుడికి కల్తీ ప్రసాదాలను నివేదించి మహా పాపాలకు ఒడిగట్టిన పాపాత్ములపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, అప్పటి ఈవోలు అనిల్‌కుమార్ సింఘాల్, ధర్మారెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవలసిందేనని స్పష్టంచేశారు. దీనిని బుధవారం (6న) జరిగే పాలక మండలి సమావేశంలో తాను ప్రతిపాదిస్తానని తెలిపారు. ఆదివారం ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేశారు. శ్రీవారి ఆలయంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అపచారాలు అన్నీ ఇన్నీ కావన్నారు. అత్యంత పవిత్రమైన లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వాడడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నాటి సీఎం జగన్ పరోక్ష సహకారంతో టీటీడీలో అవినీతి రాజ్యమేలిందని ఆరోపించారు. ముఖ్యంగా స్వామివారి ప్రసాదాల తయారీకి వాడే

# 28 నెలలు.. 28 స్కామ్‌లు

- కమీషన్లకు కేరాఫ్ కాంగ్రెస్ సర్కార్
- హ్యామ్, అక్రమ మైనింగ్ పేరిట దోపిడీ
- సీఎం అండతో రెచ్చిపోతున్న మంత్రులు
- బట్టబయలు చేసినందుకు నిందలు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపాటు




# ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో నూతన మార్పులు



- రేవంత్ సర్కార్ నూతన షరతులతో తిరోగమనంలో తెలంగాణ యువత
- 'ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఉసురుతీస్తున్న నేటి ప్రభుత్వం
- సాంకేతిక విద్యకు బడుగులు దూరం
- జీవో 7 ఉపసంహరించుకోవాలి: బీసీ నేత చిరంజీవులు డిమాండ్
- బడుగులపై కుట్ర:మాజీ వీసీ రమేశ్

# 'ఫ్యూచర్‌సిటీ' అభివృద్ధికి కీలక అడుగు



అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ భవనానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఇక 25 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐయూఎం) ప్రాంగణం భవనానికి, పదెకరాల్లో ఏర్పా టు చేయబోయే సింగరేణి ప్రధాన కార్యాలయ భవనానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు సమాచారం. వీటితోపాటు డాక్టర్ రెడ్డీస్, భారత్ బయోటెక్, హెటిరో, ఎంఎ?సఎన్, అరబిందో వంటి ఫార్మా కంపెనీలకు చెందిన పర్యావరణ హితంగా నడిచే పరిశోధనా కేంద్రాలు, ప్యాకేజింగ్ యూనిట్లకు కూడా శంకుస్థాపన చేయనున్నట్టు తెలిసింది.

### పర్యావరణ పరిరక్షణకు జాగ్రత్తలు..

దేశంలోనే మొదటి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపొందుతున్న ఈ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పునరుత్పాదక ఇంధనం, పర్యావరణ అనుకూల రవాణా, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. టెక్నాలజీలో రోజురోజుకూ కీలకంగా మారుతున్న డేటా సెంటర్ల విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రముఖ కంపెనీల డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు కూడా అందిస్తోంది. దీంతో పలు కంపెనీలు తమ డేటా సెంటర్లను రాష్ట్రంలో నెలకొల్పుతుండగా, మరికొన్ని ముందుకువచ్చాయి. ఈ నేపథ్యంలోనే అమెజాన్, కంట్రోల్ ఎస్, హైపర్వాల్ట్ కంపెనీల డేటా సెంటర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో శంకుస్థాపన చేస్తారని సంబంధిత అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఇక యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఎస్యూ) శాశ్వత క్యాంపస్ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనసాగించి.. రాబోయే కొద్ది నెలల్లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. దీంతో పనుల్లో వేగం పుంజుకుంది. త్వరలోనే దానిని పూర్తిచేసి, ప్రారంభించనున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని పలు సంస్థలను కూడా ఫ్యూచర్‌సిటీ వైపే తరలించనున్నారు. ఇందులో భాగంగా తొలుత తోలు పరిశ్రమల అభివృద్ధికి, తోలు ఉత్పత్తులను తయారు చేయడం, విక్రయించడం, ఆ రంగంలోని వారికి ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం దాదాపు 50 ఎకరాల్లో ఒక విశ్వవిద్యాలయాన్ని ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్నారు. అందుకు అవసరమైన భవనం, డిజైనింగ్ వ్యవహారాలు వేగంగా జరుగుతున్నట్టు తెలుస్తోంది. అలాగే నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)కు సైతం 50ఎకరాల్లో అధునాతన భవనాన్ని నిర్మించనున్నారు. యువతకు పలు రంగాల్లో నైపుణ్యం కల్పించేందుకు అక్కడ ప్రత్యేకఏర్పాట్లు చేయనున్నారు. వీటితోపాటు ఫ్యూచర్‌సిటీకి అవసరమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పనపైనా చర్యలు తీసుకోనున్నారు. ఫ్యూచర్‌సిటీని పలు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో.. జోన్లను అనుసంధానం చేసేలా ప్రధాన రోడ్లు, నీటి సరఫరా తదితర సదుపాయాలకు సంబం?ధించిన మొదటి దశ పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## 28 నెలలు.. 28 స్కామ్‌లు

హైదరాబాద్, మే 3 కాంగ్రెస్ 28 నెలల పాలనలో ముఖ్యమంత్రి, మంత్రులు కలిసి 28 స్కామ్‌లకు పాల్పడ్డారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సంచలన ఆరోపణలు చేశారు. ఆరు గ్యారంటీలను గాలికొదిలి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ప్రతిపక్షంపై నిందలు వేస్తూ తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ పెద్దలపై అవినీతి ఆరోపణలు రాగానే బ్యాచ్ బయటకు వచ్చి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును దూషిస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో పార్టీ రాష్ట్ర నేతలు గోసుల శ్రీనివాస్, అభిలాష్ రంగినేని, రాఘవేంద్ర యాదవ్, కిశోర్‌గౌడ్, తుంగ బాలు, ఏ హరిబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే స్కామ్‌లు, కమీషన్లు, అక్రమ దందాలకు కేరాఫ్ అని ఫైర్ అయ్యారు.
మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట సర్కార్ సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. హ్యామ్ రోడ్ల కాంట్రాక్ట్‌ను 25 శాతం ఎక్సెస్‌తో కట్టబెట్టారని, కొత్వాల్‌గూడలో మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్ చేస్తున్నదని హరీశ్‌రావు ఆధారాలతో బట్టబయలు చేశారని గుర్తుచేశారు. కానీ సమాధానం చెప్పాల్సిన అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ హరీశ్‌రావుపై అడ్డంపొడుగూ మాట్లాడడం శోచనీయమని పేర్కొన్నారు. దమ్మూ ధైర్యముంటే హ్యామ్ మోడల్ రోడ్లలో బిడ్ ఓపెన్ అయిందా? లేదా? చెప్పాలని సవాల్ విసిరారు. కొత్తగా ఎమ్మెల్సీలు కాగానే కొమ్ములొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కాదు.. అడ్డంకి దయాకర్. నోటికి వచ్చినట్లు మాట్లాడడమే ఆయన నైజం. అక్రమాలకు పాల్పడిన అధికార పార్టీ నేతలను వెనుకేసు కురావడమే ఆయన విధానం.'అంటూ తనదైన శైలిలో చురకలంటించారు. 14 ఏండ్ల ఉద్యమ ప్రస్థానం, 10 ఏండ్ల పాలనలో బీఆర్ఎస్ ఏం చేసిందో తెలంగాణ ప్రజలకు తెలుసని స్పష్టంచేశారు. తెలంగాణవార్తలు

### రాష్ట్రంలో రేవంత్, భట్టి ట్యాక్స్

ప్రజాపాలన అందిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నేతలు అక్రమాల పాలనను తెరపైకి తెచ్చారని ఎర్రోళ్ల దుయ్యబట్టారు. అన్ని శాఖల్లో విచ్చలవిడిగా అవినీతి రాజ్యమేలుతున్నదన్నారు. బర్త్ సర్టిఫికెట్‌కు కూడా లంచం ముట్టజెప్పాల్సిన దుస్థితి నెలకొన్నదని విమర్శించారు. తెలంగాణలో రేవంత్ ట్యాక్స్‌తోపాటు, భట్టి, పొన్నం, పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి, సీతక్క ట్యాక్స్‌లు నడుస్తున్నాయని తూర్పారబట్టారు. పాలనను పక్కనపెట్టి అక్రమాలు మాత్రం దండిగా చేస్తున్నారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే తాము చేసిన ఆరోపణలపై సిట్, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బల్మూరి, అద్దంకి మరోసారి అడ్డగోలుగా మాట్లాడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో నూతన మార్పులు

హైదరాబాద్, మే3 ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన నూతన మార్పులు తెలంగాణ యువత కలలను కల్లలు చేయనున్నాయి. నూతన సాంకేతిక విద్యావకాశాలకు బడుగు విద్యార్థులను దూరం చేయనున్నాయి. సంప్రదాయ కోర్సులకే వారు మళ్లీ పరిమితం కానున్నారు. ఈనాటి నిరుపేద విద్యార్థులు కూడా మళ్లీ దశాబ్దన్నర క్రితం నాటి దుర్భర పరిస్థితులను అనుభవించనున్నారు. విద్యా అసమానతలు పెరుగనున్నాయి. సూటిగా చెప్పాలంటే పురోగమన మార్గం నుంచి తిరోగమనం వైపునకు ఈనాటి యువతను నడిపించే పరిస్థితులే కనిపిస్తున్నాయి. తెలంగాణ విద్యావేత్తల్లో సర్వత్రా ఇవే భయాందోళనలు నెలకొన్నాయి. తెలంగాణవార్తలు

నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో వేసిన పునాదులపై కేసీఆర్ ఆశల సౌధాలను నిర్మిస్తే.. నేడు రేవంత్ సర్కార్ అందుకు భిన్నంగా ఉన్న ఆయువునే తీసే చర్యలకు పూనుకొన్నదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతు న్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 7 ద్వారా డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిని ప్రవేశపెట్టాలని నిర్ణయించడంతో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తీరని నష్టం చేకూరనున్నది.

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధన వల్ల ఉన్నత విద్యావకాశాలు ఇకపై కొన్ని పట్టణాలకే పరిమితమయ్యే అవకాశమున్నది. ఫీజుల భారాన్ని భరించలేక బడుగు విద్యార్థులు కాలేజీల్లో చేరకుంటే సీట్లు నిండక ప్రస్తుతమున్న అరకొర కాలేజీలను సైతం ప్రైవేట్ యాజమాన్యాలు ఎత్తివేయక తప్పని పరిస్థితులు ఎదురవనున్నాయి. గ్రామీణ విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు భారం కూడా పడనున్నది. అంతిమంగా ఉన్నత విద్య మళ్లీ మిథ్యగానే మిగిలిపోయే పరిస్థితులు దాపురించనున్నాయి

## కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు




### బెంగాల్‌పైనే అందరి దృష్టి

తాజా ఎన్నికల్లో అందరి దృష్టి పశ్చిమ బెంగాల్‌పైనే నిలిచింది. ఇక్కడ 294 అసెంబ్లీ స్థానాలుండగా, నేడు 293 స్థానాల ఫలితాలను ప్రకటించనున్నారు. ఫాల్టా నియోజకవర్గంలో పోలింగ్‌ను ఈసీ రద్దుచేసింది. ఇక్కడ ఈ నెల 21న పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో గత మూడు ఎన్నికల్లో తిరుగులేని విజ యం సాధించిన టీఎంసీ నాలుగోసారి విజయంపై ధీమాగా ఉంది. మరోవైపు బెంగాల్‌లో పాగా వేయాలని శక్తియుక్తులన్నీ ధారపోసిన బీజేపీ కూడా తనదే విజయం అని చెప్పుకుంటోంది. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువశాతం మాత్రం బీజేపీకే అనుకూలంగా వచ్చాయి. అయితే, తాము 200 పైచిలుకు స్థానాల్లో గెలవబోతున్నామని సీఎం మమత ప్రకటించారు. ఆమె పోటీ చేసిన భవానీపూర్ నియోజకవర్గం ఫలితంపైఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఇక్కడ ఆమెకు ప్రత్యర్థిగా బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి నిలబడ్డారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో ఆయన మమతను ఓడించారు. ఈసారి కూడా అదే ఫలితం వస్తుందా? మమత పైచేయి సాధిస్తుందా? అనేది మరికొన్ని గంటల్లో తేలనుంది. బెంగాల్‌లో గత నెల 23, 29 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. దేశ చరిత్రలోనే అత్యధికంగా 92.47శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో ఓట్ల లెక్కింపు కోసం దాదాపు 2.5 లక్షల మంది కేంద్ర బలగాలను నియమించారు.

### ద్రావిడ గడ్డపై 'దళపతి'పై ఏం చేసేనో..!

ఎప్పుడూ ద్విముఖ పోరు జరిగే తమిళనాడులో ఈసారి త్రిముఖ పోరు సాగింది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను డీఎంకే లేదా అన్నాడీఎంకే పార్టీలే శాసిస్తుండగా.. వీటి మధ్యలోకి ఈసారి'తమిళ వెట్రి కళగం' (టీవీకే) పార్టీతో సినీనటుడు విజయ్ ప్రవేశించారు. రాష్ట్రంలో 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ నిర్వహించగా.. 85.10శాతం పోలింగ్ నమోదైంది. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకేదే ఈసారి కూడా అధికారమని మె జారిటీ ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. 'యాక్సిస్ మై ఇండియా' మాత్రం విజయ్ పార్టీ ఏకంగా 120 వరకు సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది.
దీంతో ఫలితాలపై ఉత్కంఠ ఏర్పడింది. మరోవైపు అన్నాడీఎంకే-బీజేపీ కూటమి ప్రభుత్వ వ్యతిరేకత తమను గెలిపిస్తుందన్న ఆశతో ఉంది. ఒకవేళ విజయ్ పార్టీ గెలిస్తే తమిళనాడులో సరికొత్త రాజకీయ శకం మొదలైనట్లే.
కాగా, రాష్ట్రంలో హంగ్ ఏర్పడే అవకాశముందన్న అంచనాలతో దళపతి విజయ్ తన పార్టీ అభ్యర్థులను అప్రమత్తం చేశారు. గెలిచేవారంతా వెంటనే పార్టీ ప్రధాన కార్యాలయంలో రిపో ర్టు చేయాలని ఆదేశించారు. వారిని ఓ రిసార్టుకు తరలించే ఆలోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం.

## ఎయిడెడ్ టీచర్ల సీనియారిటీ జాబితా రూపొందించాలి



అమరావతి, మే 3 ఎయిడెడ్ టీచర్లకు సీనియారిటీ జాబితా రూపొందించి, కౌన్సెలింగ్ ద్వారా ఒక్కరే టీచర్ ఉన్న పాఠశాలలకు బదిలీ చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది. గిల్డ్ ప్రతినిధులు బి.చిట్టిబాబు, ఎల్.కె. చిన్నప్ప, ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 205 ఎయిడెడ్ పాఠశాలల్లో ఒక్కొక్కరు చొప్పున మాత్రమే టీచర్లు ఉన్నారని తెలిపారు. మరణించిన టీచర్ల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, భాషా టీచర్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

## కల్తీ నెయ్యితో ప్రసాదం మహాపాపం

నెయ్యి విషయంలో అప్పటి పాలకమండలి నిబంధనలను ఇష్టారాజ్యంగా సడలించిందన్నారు. నాడు ప్రసాదాల తయారీకి వాడింది అసలు నెయ్యే కాదని, కేవలం కెమికల్స్‌తో తయారుచేసిన రసాయన నెయ్యి అని సిట్, దినేశ్‌కుమార్ కమిషన్ స్పష్టం చేశాయని చెప్పారు. పవిత్రమైన నైవేద్యాన్ని కల్తీ చేసి, దేవుడికి, భక్తులకు ద్రోహం చేసినవారు ముమ్మాటికీ పాపాత్ములేనన్నారు. స్వామి పట్ల అపచారం చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిన వారికి చట్టపరంగా తగిన బుద్ధి చెప్పేవరకు పాలక మండలి విశ్రమించదన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు సర్కార్ కుట్ర

రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌ను రద్దుచేసేందుకు రేవంత్ ప్రభుత్వం భయంకరమైన కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దని, జీవోను వెనక్కి తీసుకొని వెంటనే విద్యార్థిలోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

### సొంత పార్టీ పథకానికే తూట్లు

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ సీఎం వైఎస్సార్ సదుద్దేశంతో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రాజకీయాలకతీతంగా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కొనసాగించారని కేటీఆర్ గుర్తుచేశారు. విద్యార్థుల ఉన్నత చదువులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారని చెప్పారు. కరోనా కాలంలోనూ నిరంతరాయంగా నిధులు విడుదల చేసిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. కానీ రేవంత్ గద్దెనెక్కిన వెంటనే ఈ బృహత్తర పథకానికి గ్రహణం పట్టిందని దుమ్మెత్తిపోశారు. ఈ చేతగాని సర్కార్ సొంత పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన స్కీమ్‌కే తూట్లు పొడుస్తున్నదని దుయ్యబట్టారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టిన కాంగ్రెస్, జీవో 7 ద్వారా ఫీజుల పథకాన్ని సమాధి చేసేందుకు కంకణం కట్టుకున్నదని నిప్పులుచెరిగారు. విద్యకోసం చేసే ఖర్చును ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టే పెట్టుబడిగా చూడాలి తప్ప, భారంగా భావించి చేతులు దులుపుకోవడం దుర్మార్గమని తూర్పారబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేస్తే ఎక్కువగా నష్టపోయేది సమాజంలోని అట్టడుగు, బలహీనవర్గాల పిల్లలేనని గుర్తుచేశారు.

### టోకెన్లు, కమిటీల పేరిట మభ్యపెట్టారు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌పై కత్తిగట్టిందని కేటీఆర్ విమర్శించారు. ఈ పథకం ఆధారంగా నడుస్తున్న రాష్ట్రంలోని 2,500 పైగా ఉన్నత విద్యాసంస్థలకు ఫీజు బకాయిలు చెల్లించకుండా వేధింపులకు గురిచేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరిట కొంతకాలం, ట్రస్ట్, టోకెన్ల ముసుగులో ఇంకొంత కాలం, కమిటీల పేరిట మరికొన్ని రోజులు మభ్యపెట్టిందని మండిపడ్డారు. చీకటి జీవో జారీ చేసి చివరికీ అసలుకే ఎసరు తెచ్చిందని నిప్పులు చెరిగారు.కాంగ్రెస్ ప్రభుత్వం దివాలాకోరు విధానాలను చూసి విద్యార్థిలోకం అసహ్యించుకుంటున్నదని తెలిపారు. పెద్దమొత్తంలో ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో గత్యంతరంలేక కాలేజీలు బంద్‌పెట్టి ఆందోళనకు దిగిన యాజమాన్యాలపై విజిలెన్స్ దాడులు చేసి వేధించారని విమర్శించారు. చివరికి రూ. 1,207 కోట్ల విలువతో ఇచ్చిన టోకెన్లకు నేటికీ దిక్కులేకుండా పోయిందని, వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సిన నిధులకు రెండున్నరేండ్లుగా బ్రేకులు వేయడం వెనుక ఉన్న అసలు కుట్ర ఇప్పుడు బట్టబయలైందని ధ్వజమెత్తారు.

## అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ రెడీ

(అమరావతినేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లు కీలక పాత్ర పోషిస్తాయి. నేరం జరిగిన ప్రదేశం నుంచి చిన్న ఆధారాలను సైతం శాస్త్రీయంగా విశ్లేషించి నిందితులను త్వరగా గుర్తించేందుకు, కోర్టుల్లో నేరం నిరూపించేందుకు సహాయపడతాయి. ప్రత్యక్ష సాక్షులు లేని కేసుల్లో.. ఈ ఫోరెన్సిక్ నివేదికలే నిజమైన నేరస్థుడిని పట్టుకోవడానికి ఉపయోగపడతాయి.

ఇంతటి ప్రాధాన్యం కలిగిన అధునాతన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్.. రాష్ట్ర రాజధాని అమరావతిలో సిద్ధమైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో తుళ్లూరులోని ఎన్-14, ఈ-5 జంక్షన్‌లో ఐదెకరాల స్థలంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన ఐదు భవనాల సముదాయం పూర్తయింది. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి చంద్రబాబు దీన్ని ప్రారంభించనున్నారు. ఎఫ్ఎస్ఎల్ ఇచ్చే కచ్చితమైన నివేదికలు నేరస్తులకు శిక్ష పడేలా చేస్తాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. సీఆర్‌డీఏ భవనం తర్వాత రాజధానిలో ప్రారంభంకానున్న భవన సముదాయం ఇదేనని తెలిపారు. దేశంలోని ఎనిమిది అత్యాధునిక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ల్లో ఇదొకటని పేర్కొన్నారు.

త్వరితగతిన విచారణ...: ఒకప్పుడు నేరాలు జరిగితే.. ఘటనా స్థలంలో నిపుణులు సేకరించే వేలి ముద్రలు, తల వెంట్రుకలు, రక్తం.. వంటివి కేసు పరిష్కారంలో కీలక పాత్ర పోషించేవి. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి తే ఆరు నెలలకో, ఏడాదికో నివేదిక వచ్చేది. ఈ ప్రక్రియలో జాప్యం వల్ల కేసులు ఎక్కువగా నిలబడేవి కావు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా నేరస్థులు కూడా పాత పద్ధతులు, దర్యాప్తు విధానాలను పసిగట్టి జాగ్రత్త పడుతున్నారు. ఆనవాళ్లు దొరక్కుండా నేరాలు చేసి తప్పించుకొంటున్నారు. అటువంటి వారి ఆట కట్టించేందుకు దర్యా ప్తు సంస్థలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను పాటిస్తున్నాయి. దీనికోసం కోట్లాది రూపాయల విలువైన సైబర్ ఫోరెన్సిక్, డిజిటల్ ఫోరెన్సిక్, కెమి స్ట్రీ, బయాలజీ వంటి ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకుని నేరగాళ్లను కచ్చితంగా గుర్తిస్తున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేస్తున్న పోలీసుశాఖ అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిర్మాణాన్ని పూర్తి చేసింది. మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ ల్యాబ్‌లు నెలకొకటి చొప్పున ప్రారంభిస్తూ దర్యాప్తు వ్యవస్థను బలోపేతం చేసుకుంటోంది.

### 2017లోనే నిర్మాణాలు ప్రారంభం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ నేరం జరిగినా ఘటనా స్థలంలో సేకరించే ఆధారాలను భద్రపరిచి హైదరాబాద్ ఎఫ్ఎస్ఎల్‌కు పంపేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్ లేకుండా పోయింది. దీంతో 2017లో కేంద్రంతో మాట్లాడిన సీఎం చంద్రబాబు రాష్ట్రానికి అధునాతన ఎఫ్ఎస్ఎల్ నిర్మాణానికి అనుమతి తీసుకొచ్చారు. రూ.253 కోట్ల అంచనాతో రాజధానిలోని తుళ్లూరు ప్రాంతంలో దీని నిర్మాణానికి 2017 డిసెంబరు 28న భూమిపూజ చేశారు. మొదటి శ్లాబు వేసేలోపు ఏపీలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అంతే.. మొత్తం నిర్మాణం ఆగిపోయింది. 2024లో మళ్లీ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఐదెకరాల విస్తీర్ణంలో 5 బ్లాకులుగా చేపట్టిన నిర్మాణం పూర్తయింది. ఈ ల్యాబ్‌లో ఏర్పాటు చేసే అధునాతన పరికరాలు ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల షిప్పులో ఆగిపోయాయని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే వాటిని భవనాల్లో ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రారంభం చేయించాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

# అక్రమ అద్దాల మేడలు

# రికార్డుల్లో మాత్రం సున్నా

- పేదవాడికి ఉచిత సమాచారం ఏదీ?
- బడా కట్టడాల వెనుక బినామీల హస్తం
- సర్వే నెంబర్లు అడిగితేనే సమాచారమా? అధికారుల వింత వాదన
- చట్టం గిరిజనులది, పెత్తనం గిరిజనేతరులది
- వినాయకపురంలో యథేచ్ఛగా భూదందా.. సర్వే నెంబర్ల సాకుతో అధికారుల తప్పించుకుడు ధోరణి
- అక్రమంగా వెలుతున్న వ్యాపార సామ్రాజ్యాలు
- పంచాయతీ అధికారుల వైఫల్యం, సమాధానం లేని ప్రశ్నలు
- బినామీల హస్తం గిరిజనుల అమాయకత్వం ఆర్.టి.ఐ అడిగితే వెయ్యి రూపాయల డిమాండ్,పేద దరఖాస్తుదారుడిపై ఫీజుల భారం
- సర్వే నెంబర్లు చెప్పమంటున్న రెవెన్యూ యంత్రాంగం బాధ్యత నుండి తప్పించుకోవడమేనా?




**నవతరం ప్రతినిధి: ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**


- 1/70 చట్టం గాలికే.. అధికారుల అండదండలతోనే భూ దందా?
- RTI అడిగితే ?1,000 డిమాండ్.. పేద దరఖాస్తుదారుడిపై ఫీజుల భారం!
- సర్వే నంబర్లు చెప్పమంటున్న రెవెన్యూ యంత్రాంగం.. బాధ్యత నుండి తప్పుకోవడమేనా?


(నవతరం ప్రతినిధి): ఖమ్మం భద్రాద్రి జిల్లా











కార్యాలయములో లభ్యమగు సమాచారం ఇవ్వగలము.
కావున, పై విషయమును ఈ మెమో ద్వారా సమాచార హక్కు చట్టం, 2005 క్రింద మీకు తెలియజేయనైనది.
పౌర సమాచార అధికారి & నాయబ్ తహశీల్దార్,
తహశీల్దార్ కార్యాలయము,అశ్వారావుపేట
To,
శ్రీ టి. సాంబ శివ రావు , తండ్రి చిట్టయ్య నివాసం తిమ్మాపురం గ్రామం, వేదాంత పురం పంచాయితీ , అశ్వారావుపేట మండలం గారికి.

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన భూములకు రక్షణ కవచంలా ఉండాల్సిన 'భూ బదిలీ నియంత్రణ చట్టం' ( 1/70 యాక్టు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వారావుపేట మండలంలో ఏజెన్సీ ప్రాంతాల్లో అభాసుపాలవుతోంది. ఉదాహరణకు మండలంలో వినాయకపురం నందు కళ్లముందే భారీ వాణిజ్య సముదాయాలు, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు వెలుస్తున్నా.. అధికారుల రికార్డుల్లో మాత్రం అవి కనిపించకపోవడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




సర్వే నంబర్లు మాకు తెలియవు.. మీరే చెప్పండి అనే తిరుగు ప్రశ్నలు అధికారుల సమాధానాల్లో కనిపించడం విడ్డూరం.

మండల కేంద్రంలోని పలు జి౦2, జి౦3 అంతస్తుల భవనాల అనుమతులపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరగా, తహసీల్దార్ కార్యాలయం నుండి వింత సమాధానం ఎదురైంది. "సదరు కట్టడాల సర్వే నంబర్లు దరఖాస్తుదారే తెలియజేయాలని, అప్పుడే సమాచారం ఇస్తామని" అధికారులు బదులిచ్చారు. గ్రామానికి సంబంధించిన అడంగల్, పహాణీ, విలేజ్ మ్యాపులు అన్నీ తమ అధీనంలో ఉంచుకుని, సామాన్యుడిని సర్వే నంబర్లు అడగడం అధికారుల అసమర్థతకు నిదర్శనమని సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు.

ఆర్.టి.ఐ చట్టానికి తూట్లు.. ?1,000 డిమాండ్ చేయడం ఇక్కడ గమనార్హం.

అక్రమాలపై సమాచారం కోరిన వారిని భయభ్రాంతులకు గురిచేసేలా అధికారులు వ్యవహరిస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి (బిపిఎల్), ఆహార భద్రత కార్డు కలిగిన వారికి ఉచితంగా సమాచారం ఇవ్వాల్సి ఉండగా.. నిబంధనలకు విరుద్ధంగా ?1,000 డీడీ తీయాలని షరతు విధించడం చర్చనీయాంశంగా మారింది. ఇది ఆర్.టి.ఐ సెక్షన్ 7(5)ని ఉల్లంఘించడమేనని మేధావులు అభిప్రాయపడుతున్నారు. అక్రమ కట్టడాల వివరాలు బయటపడకుండా ఉండేందుకే ఇలాంటి ఆర్థిక అడ్డంకులు సృష్టిస్తున్నారా? అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

జిపిఎస్ సాక్ష్యాలతో సామాన్యుడు సవాల్కు సిద్ధమయ్యాడు.

అధికారులు సమాచారాన్ని దాటవేస్తున్న నేపథ్యంలో, దరఖాస్తుదారులు సాంకేతికతను ఆశ్రయిస్తున్నారు. ఆధునిక 'నోట్ కెమెరా' ద్వారా భవనాల ఖచ్చితమైన జిపిఎస్ ఆనవాళ్లు, ఖచ్చితమైన లొకేషన్ సేకరించి అధికారుల ముందే సాక్ష్యాలను ఉంచుతున్నారు. "బిల్డింగ్‌లు కళ్లముందే కనిపిస్తున్నా రికార్డులు లేవనడం హాస్యాస్పదం. ఈ జిపిఎస్ ఆధారాలతో జిల్లా కలెక్టర్ మరియు ఐ టి డి ఏ అధికారులకు ఫిర్యాదు చేస్తాం" అని బాధితులు హెచ్చరిస్తున్నారు.

## అసలు1/70 చట్టం ఏమైంది?


షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనేతరులు భూములు కొనడం లేదా భారీ కట్టడాలు నిర్మించడం చట్టవిరుద్ధం. కానీ




అశ్వారావుపేటలో గిరిజనేతరుల పేరు మీద భారీ వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి? వీటికి పంచాయతీ పన్నులు ఎలా విధిస్తున్నారు? అన్న ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని జరుగుతున్న ఈ దోపిడీపై ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా యంత్రాంగం ఏం చేస్తోంది?

అశ్వారావుపేట మండలంలో వినాయకపురం నందు జరుగుతున్న ఈ భూ దందాలు, ఆర్.టి.ఐ ఉల్లంఘనలపై జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేక విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది. చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే అక్రమార్కులకు కొమ్ముకాస్తే, ఇక గిరిజన హక్కులకు రక్షణ ఎక్కడిది?




**"అనుమతులు లేవు.. ఏం చేయమంటారు?" అంటూ పంచాయతీ కార్యదర్శి వంకర సమాధానం. ఇది బాధ్యతారాహిత్యం కాదా?**

**"అక్రమ కట్టడాలపై వినాయకపురం గ్రామపంచాయతీ సెక్రటరీని వివరణ కోరగా, మరో విస్మయకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. సదరు భవనాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అంగీకరిస్తూనే.. 'అనుమతి ఇవ్వలేదు, ఇప్పుడు ఏం చేయమంటారు?' అంటూ ఎదురు ప్రశ్నించడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. ఒక పక్క అనుమతులు లేవని చెబుతూనే, మరోపక్క ఆ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా చేతులు ఎత్తేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వినాయకపురంలో 'అక్రమ' అద్దాల మేడలు: రికార్డుల్లో మాత్రం అన్నీ సున్నాలే.**

**రికార్డుల మాయాజాలం: కళ్లముందు భవనాలున్నా.. సర్వే నంబర్లు తెలియవంటున్న రెవెన్యూ యంత్రాంగం.**

**ఆర్.టి.ఐ చట్టానికి తూట్లు: బిపిఎల్ దరఖాస్తుదారుడిని ?1,000 డీడీ అడగడం చట్టవిరుద్ధం కాదా?**

**ఏజెన్సీ చట్టం గాలికే: 1/70 ఉల్లంఘనలపై అధికారుల మౌనం.. అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారా?**

**జిపిఎస్ సాక్ష్యాలతో సామాన్యుడి పోరాటం: లాటిట్యూడ్, లాంగిట్యూడ్ ఫోటోలతో అధికారులకు చెక్.**

**కలెక్టర్ వారూ కదలండి: అశ్వారావుపేట అక్రమ కట్టడాలపై విచారణకు డిమాండ్.**

నవతరం
నేటితరం కోసం...



# ప్రైమ్ నుంచి జీ5కి..

## దారుణంగా 'జననాయగన్' ఓటీటీ డీల్!

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ నటించిన చివరి చిత్రంగా చెప్పుకోబడుతున్న 'జననాయగన్'కు కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. జనవరిలో సంక్రాంతికి రావాల్సిన ఈ సినిమా ఇంత వరకు విడుదలకు నోచుకోలేదు. సినిమాషాపింగ్
ప్రైమ్ నుంచి జీ5కి.. దారుణంగా 'జననాయగన్' ఓటీటీ డీల్!కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ (ఎఱయిఖఎ) నటించిన చివరి చిత్రంగా చెప్పుకోబడుతున్న 'జననాయగన్' (జీఖఋ చీఖఋస్త్రుఋఅ)కు కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. జనవరిలో సంక్రాంతికి రావాల్సిన ఈ సినిమా ఇంత వరకు విడుదలకు నోచుకోలేదు. సెన్సార్ ఇష్యూస్‌తో వాయిదా పడుతూ, కోర్టుల వరకు వెళ్లిన ఈ మూవీ రిలీజ్ కాంట్రవర్సీ గురించి అందరికీ తెలిసిందే. ఆ కాంట్రవర్సీని దాటుకుని విడుదలకు సిద్ధమైన తరుణంలో తమిళనాట ఎన్నికలు ఈ సినిమా విడుదలను ఆపేశాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో, మరోసారి విడుదల ఆగిపోవడం, అదే టైమ్‌లో పైరసీ రూపంలో సినిమా సోషల్ మీడియాలో ప్రత్యక్షమవడం.. ఇలా ఏదో ఒక రూపంలో 'జననాయకుడు' వార్తలలో ఉంటూనే ఉంది. ఇప్పుడు ఓటీటీ రైట్స్ విషయంలో మరోసారి ఈ సినిమా వార్తలలో హైలెట్ అవుతోంది.
పైరసీ సమయంలో పలువురు సెలబ్రిటీలు చిత్ర నిర్మాణ సంస్థకు అండగా నిలిచారు. ఆ పైరసీకి కారణమైన వారిని కూడా పోలీసులు పట్టుకున్నారు. ఇక ఎన్నికల ఫలితాల అనంతరం, మేకర్స్ రిలీజ్ డేట్‌ని ప్రకటించే అవకాశం ఉంది. ఓటీటీ రైట్స్ విషయానికి వస్తే, ఈ సినిమా అనుకున్నట్టుగా విడుదలై ఉంటే, ఓటీటీ రూపంలో దాదాపు రూ. 120 కోట్లు వచ్చేవి. అమెజాన్ ప్రైమ్ వీడియో (ూఎఖఓశీఅ ూతీఱఎవ ఎఱంవశీ) ఓటీటీ సంస్థ ఈ సినిమాను రూ. 120 కోట్లకు కొనుగోలు చేసేందుకు డీల్ కుదుర్చుకున్నట్లుగా అప్పట్లో వార్తలు వచ్చాయి. కాంట్రవర్సీలలో చిక్కుకుని ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంతో, అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ డీల్‌ను వదిలేసుకున్నారట.
దు అమెజాన్ ప్రైమ్ ప్లేస్‌లో జీ5 (వవ5) ఈ సినిమా రైట్స్ కోసం ప్రయత్నిస్తున్నట్లుగా టాక్ నడుస్తోంది. అయితే మొదట రూ. 120 కోట్లకు వచ్చిన డీల్.. ఇప్పుడు రూ. 50 కోట్లకి పడిపోవడంతో.. చిత్ర నిర్మాతకు మరో ఎదురు దెబ్బ తగిలినట్లయింది. కాకపోతే.. ఇంకా డీల్ పూర్తి కాలేదని, ప్రస్తుతం చర్చలు నడుస్తున్నాయని, త్వరలోనే ఈ రైట్స్ విషయంలో ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. చూద్దాం.. ఫైనల్‌గా ఈ మూవీ ఓటీటీ రైట్స్‌ను ఎవరు, ఎంతకి కొనుగోలు చేస్తారో?




# 'డెకాయిట్'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ఇంటెన్స్ యాక్షన్ డ్రామా 'డెకాయిట్'ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. ఈ క్రేజీ యాక్షన్ చిత్రాన్ని ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో మే 8వ తేదీ నుండి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గత నెల ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, అడివి శేష్ మార్క్ యాక్షన్ మరియు మృణాల్ ఠాకూర్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. షానియల్ డియో దర్శకత్వం వహించిన ఈ చిత్రం, విడిపోయిన ఇద్దరు ప్రేమికులు మళ్ళీ కలుసుకున్నప్పుడు వారి జీవితాల్లో ఎదురైన సవాళ్లు మరియు ప్రతీకారం నేపథ్యంలో సాగుతుంది. ముఖ్యంగా బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఇందులో కీలక పాత్రలో నటించడం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ మరియు మలయాళ భాషల్లో కూడా ఈ చిత్రం అందుబాటులోకి వస్తుండటంతో అటు శేష్ అభిమానులు, ఇటు ఓటీటీ ప్రియులు మే 8 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అల్లు అర్జున్ 'రాకా'లో ఆ స్టార్ హీరో!..

## అట్లీ, అసలేం చేస్తున్నావయ్యా!






ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటోన్న చిత్రం 'రాకా' రీసెంట్‌గానే ఈ మూవీ టైటిల్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా అనౌన్స్ అయినప్పటి నుంచి, ఎటువంటి అంచనాలు నెలకొన్నాయో తెలియంది కాదు. మరీ ముఖ్యంగా 'పుష్ప 2' తర్వాత అల్లు అర్జున్ చేస్తున్న చిత్రమిది. అందుకే, 'రాకా'కు సంబంధించి ఏ చిన్న విషయం వచ్చినా పాన్ ఇండియా స్థాయిలో వైరల్ అవుతోంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియా సర్కిల్స్‌లో బాగా సంచారం చేస్తోంది
ఆ వార్త ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ఇందులో ఓ కీలక పాత్ర పోషిస్తున్నాడట. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన అయితే రాలేదు కానీ, అక్షయ్ కుమార్ కోసం అట్లీ ఓ పాత్రను ప్రత్యేకంగా డిజైన్ చేశాడనేలా మాత్రం టాక్ నడుస్తోంది. మరి ఈ టాక్‌పై చిత్రయూనిట్ ఎలా రియాక్ట్ అవుతుందో వేచి చూడాల్సి ఉంది. మరో వైపు ఇప్పటికే ఇందులో షారుఖ్ ఖాన్ నటిస్తోన్నట్లుగా వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో అక్షయ్ పేరు వినబడగానే, అట్లీ ఏదో గ్రాండ్‌గానే ప్లాన్ చేస్తున్నాడంటూ టాక్ మొదలైంది. అక్షయ్ కుమార్ విషయానికి వస్తే.. ఇంతకు ముందు 'కన్నప్ప' వంటి చిత్రంలో ఓ కీలక పాత్రను పోషించి, తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇప్పుడు అల్లు అర్జున్ చిత్రంలో అంటే, ఆయనకు కూడా తెలుగులో మంచి గుర్తింపు వచ్చే అవకాశం లేకపోలేదు. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది.
ఫస్ట్ లుక్.. ట్రెమండస్ రెస్పాన్స్‌ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ సరసన దీపికా పదుకొణెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ వంటి వారు హీరోయిన్లుగా నటిస్తోన్న ఈ చిత్రాన్ని కోలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ సినిమా అప్డేట్స్ కోసం అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమాతో మరోసారి మా హీరో రికార్డులు బద్దలు కొడతాడంటూ.. ఇతర హీరోల ఫ్యాన్స్‌కు సవాల్ విసురుతున్నారు.



# గ్లామర్ పాత్రలకు బ్రేక్ ..

## శ్రీలీల కెరీర్‌లో కొత్త మలుపు

టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇప్పుడు తన కెరీర్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. 'పెళ్లిసందడి' సినిమాతో అలరించిన ఆమె, అద్భుతమైన డాన్స్, ఆకట్టుకునే నటనతో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. వరుసగా స్టార్ హీరోల సరసన నటిస్తూ కెరీర్ గ్రాఫ్‌ను వేగంగా పెంచుకున్నప్పటికీ, ఇటీవల ఆమె నటించిన కొన్ని భారీ సినిమాలు ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో శ్రీలీల తన రూట్‌ను మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు గ్లామర్, కమర్షియల్ పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన ఆమె, ఇకపై బలమైన కథాంశం ఉన్న సినిమాలపై దృష్టి పెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా కుటుంబ కథా చిత్రాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో నటించాలని తన కోరికను వెల్లడించింది.
ఇక ప్రస్తుతం ఈ యంగ్ హీరోయిన్ కోలీవుడ్‌పైనా ఫోకస్ పెంచింది. ఇప్పటికే 'పరాశక్తి' అనే తమిళ చిత్రంతో అక్కడి ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఇప్పుడు ధనుష్ సరసన ఆయన 55వ చిత్రంలో నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. "వైవిధ్యభరితమైన పాత్రలే నటిగా నాలోని పూర్తి ప్రతిభను బయటకు తీస్తాయి.

# పూజా కార్యక్రమాలతో మొదలైన గోపీచంద్ కొత్త సినిమా..

## వి.వెంకట్ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్!



ఇటీవల విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచింది. మండుతున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇది ఒక ఇంటెన్స్ మైథికల్ యాక్షన్ డ్రామా అని స్పష్టమవుతోంది. ఈ చిత్రానికి టాలీవుడ్ టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. సామ్ సి.ఎస్ సంగీతాన్ని అందిస్తుండగా, శామ్‌దత్ ఐఎస్‌సి ఛాయాగ్రహణం బాధ్యతలు చేపట్టారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మౌనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గోపీచంద్ 'భరత వర్ష' అనే పీరియడ్ చిత్రంలో నటిస్తుండగా, ఆ సినిమా పూర్తయిన వెంటనే ఈ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభం కానుంది

# ఒకే వేదికపై సమంత-నాగచైతన్య..



హైదరాబాద్‌లో జరిగిన ప్రముఖ వ్యాపారవేత్త, నిర్మాత సునీల్ నారంగ్ కుమార్తె సిమ్రాన్ నారంగ్ వివాహ రిసెప్షన్ వేడుక సినీ, రాజకీయ వర్గాల సమక్షంలో ఘనంగా జరిగింది. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుకకు టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు హాజరై సందడి చేశారు. ముఖ్యంగా చిరంజీవి, నాగార్జున వంటి అగ్ర తారలు విచ్చేసి కొత్త దంపతులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది మాజీ జంట సమంత మరియు నాగ చైతన్య ఒకే వేదికపై కనిపించడం. విడిపోయిన తర్వాత ఈ ఇద్దరూ ఒకే కార్యక్రమానికి హాజరు కావడం అరుదైన విషయం కావడంతో అందరి దృష్టి వారిపైనే నిలిచింది.వసమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి వేడుకకు హాజరయ్యారు. ఆమె ఊదా రంగు చీరలో మెరిసిపోగా, రాజ్ ఫార్మల్ సూట్‌లో కనిపించారు. మరోవైపు నాగ చైతన్య తన భార్య, హీరోయిన్ శోభితా ధూళిపాళ్లతో పాటు తండ్రి నాగార్జున, తల్లి అమలతో కలిసి కార్యక్రమానికి వచ్చారు. శోభితా నీలం-గులాబీ రంగు చీరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేదికపై కొత్త జంటను ఆశీర్వదించే సమయంలో నాగ చైతన్య-శోభిత జంట కెమెరా కళ్లకు చిక్కగా, సమంత-రాజ్ జంట కూడా ప్రత్యేకంగా కనిపించింది.

# ఎన్టీఆర్ సినిమాలో బాలీవుడ్ భామ స్పెషల్ సాంగ్?



యంగ్ టైగర్ ఎన్టీఆర్‌సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలయికలో రూపుదిద్దుకుంటోన్న సినిమా కోసం సినీ ప్రియులతో పాటు తారక్ అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. 'డ్రాగన్' (�ణతీఖస్త్రశీఅ) అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ తన కెరీర్‌లోనే ఒక మాస్టర్ పీస్‌గా మలచాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. ఇందుకోసం ఆయన స్క్రిప్ట్ పనులకే సుదీర్ఘ సమయం కేటాయించడం విశేషం. ఇప్పటి వరకు వచ్చిన ప్రశాంత్ నీల్ సినిమాలన్నింటికంటే ఈ చిత్రం విజువల్స్ పరంగా, మేకింగ్ పరంగా సరికొత్త రికార్డులను సృష్టిస్తుందని సినీ వర్గాలు బలంగా నమ్ముతున్నాయి. ఈ సినిమా గురించిన లేటెస్ట్ అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఎన్టీఆర్ మాస్ ఇమేజ్‌కు, ఆయన అద్భుతమైన డాన్స్ స్కిల్స్‌కు తగ్గట్టుగా సినిమాలో ఒక హై-వోల్టేజ్ ఐటెం సాంగ్ (�䷀వఎ ాశీఅస్త్ర)ను ప్లాన్ చేస్తున్నారట. ఈ భారీ ప్రాజెక్ట్‌లో కాస్టింగ్ కూడా అంతే పవర్‌ఫుల్‌గా ఉంది. కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో మెరవబోతున్నారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com